## క్లుప్తంగా

### ఉద్యమం రిజిస్ట్రేషన్‌తో బహుళ ప్రయోజనాలు



**దుగ్గిరాల:** ఉద్యమం రిజిస్ట్రేషన్ నమోదు ద్వారా చిన్న, సూక్ష్మ, మధ్య తరగతి సంస్థల నిర్వాహణకు గుర్తింపు, ప్రభుత్వ రాయితీలు పొందడానికి వీలు కలుగుతోందని మంగళగిరి నియోజకవర్గ ప్రత్యేక అధికారి, హౌసింగ్ పీడీ జేవీఎస్ఆర్‌కేవీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం దుగ్గిరాలలోని మండల సమావేశ మందిరంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వి.చంద్రమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. అనంతరం 100 దరఖాస్తులను ఉద్యమం పోర్టల్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్.జబీన్, నాగేంద్రబాబు, పలు చిరు వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

### ఇన్‌చార్జి ఎంపీడీవోగా చంద్రమోహన్



**దుగ్గిరాల:** దుగ్గిరాల ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు శిక్షణ నిమిత్తం నెల రోజుల పాటు అందుబాటులో లేనందున మండల పరిషత్ పాలనాధికారి వి.చంద్రమోహన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అక్టోబరు 2వ తేదీ వరకు చంద్రమోహన్ అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు.

### ఆశా కార్యకర్తల వేతనాలు పెంచాలి



**దుగ్గిరాల:** ప్రజలకు అనేక సేవలందిస్తున్న ఆశా వర్కర్లుకు వేతనాలు పెంచాలని సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు జెట్టి బాలరాజు అన్నారు. మంగళవారం ఈమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా ఆయన ఆశా వర్కర్లను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ఆశాలకు అందడం లేదని.. వారి వేతనం రూ.10 వేల నుంచి రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పని ఒత్తిడి తగ్గించి వారి సమస్యలను త్వరగా పరిష్కరించాలి ఆయన కోరారు. కార్యక్రమంలో పి.విజయ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



**మేడికొండూరు:** అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఇంటర్నల్ హ్యాకథాన్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో ఆగస్టు 28 యూనివర్సల్ ఇంజనీరింగ్ టెక్నాలజీని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ రెవ.ఫా.పి.బాలస్వామి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.కోటిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులలో సృజనాత్మకత, సమస్యల పరిష్కార నైపుణ్యం, టీమ్ వర్క్‌ను పెంపొందించడమే హ్యాకథాన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మొత్తం 7 జట్లుగా 42 మంది విద్యార్థులు పోటీలో తమ ప్రతిభను ప్రదర్శించగా, ఆవిష్కరణాత్మక ఆలోచనలతో రెండు జట్లు ప్రత్యేక గుర్తింపు పొందాయన్నారు. ఎంపికై న జట్లు సెప్టెంబరు 10న జరుగనున్న సెమీఫైనల్స్‌లో పాల్గొంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఎంపికై న జట్లకు సెక్రటరీ, ప్రిన్సిపాల్‌తో పాటు విభాగాధిపతులు అభినందనలు తెలిపారు. హ్యాకథాన్ ద్వారా విద్యార్థులలో కొత్త ఆవిష్కరణలు, టెక్నాలజీ పట్ల ఆసక్తి మరింతగా పెరిగిందని నిర్వాహకులు సంతృప్తి వ్యక్తం చేశారు.

### విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ ఆసరా



**మేడికొండూరు:** సత్తెనపల్లి మండలం భృగుబండ గ్రామానికి చెందిన పేద విద్యార్థిని గాడిదపాటి మౌనికకు 'స్ఫూర్తి ఫౌండేషన్' అండగా నిలిచింది. ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించిన మౌనిక గుంటూరులోని వీవీ ఐటీ కాలేజీలో ఉచిత సీటు పొందగలిగింది. ఆమె ఉన్నత చదువుకు కావాల్సిన సహాయ వివరాలను స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కడియాల శివప్రసాద్ ఫౌండేషన్ దాతలకు తెలియజేశారు. దీంతో ఫౌండేషన్ చైర్మన్, శ్రీవ్యాల్, శిరీష, రూ.80 వేలు విడుదల చేయగా శివప్రసాద్ మౌనికకు చెక్కును మంగళవారం అందజేశారు.

### నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి

**తాడికొండ:** తాడికొండ మండల పరిధిలోని తాడికొండ, పొన్నెకల్లు గ్రామాల్లో పత్తి పంట నష్టపోతున్న రైతులకు న్యాయం జరగాలని కోరుతూ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ బృందం మంగళవారం గ్రామాలలో పర్యటించారు. పత్తి దిగుమతి చేసుకునే జీవోను ఉపసంహరించుకోవాలని కోరుతూ ప్రధానికి వినతి పత్రం ద్వారా తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



పేరేచర్లలో డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, వేమారెడ్డి



నివాళులర్పిస్తున్న సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

# రాజశేఖరా.. మళ్లీ రావా!

**దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలను వాడవాడలా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహానేత రాజన్న విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలు చోట్ల పేదలకు పండ్లు, అన్నదానం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. రాజన్న చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.**



తాడేపల్లి వైఎస్సార్ సెంటర్ కార్యక్రమంలో నివాళులర్పిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

- వాడవాడలా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి
- రాజన్న విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలతో నివాళులు
- అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

**తాడేపల్లి రూరల్:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో పార్టీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి వైఎస్సార్ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమారెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు మారు పేరు వైఎస్సార్ అని కొనియాడారు. అనంతరం పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు. కొలనుకొండలో పార్టీ అధ్యక్షులు నూతక్కి శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన అన్నసంతర్పణ కార్యక్రమంలో వేమారెడ్డి పాల్గొని ప్రారంభించారు. వేణుగోపాల సోమిరెడ్డి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, అభిమానులు పాల్గొన్నారు. కుంచనపల్లి పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు అమరా నాగయ్య రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు, మెల్లెంపూడి, ఇప్పటం, కొలనుకొండ, పెనుమాక, ఉండవల్లి తదితర ప్రాంతాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, అనుబంధ సంస్థల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

**బడుగు బలహీన వర్గాల ఆశ జ్యోతి వైఎస్సార్..**

**మేడికొండూరు:** బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని పార్టీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు తెలిపారు. మంగళవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా పేరేచర్ల డొంక రోడ్డులో వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజల కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకుడు వైఎస్సార్ అని ఆయన కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లూరు వంశీకృష్ణ, పేరేచర్ల గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ సుభాని, ముత్యాల బాలస్వామి, గండికోట రసూలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మేడికొండూరు:** ఉమ్మడి రాష్ట్రంలోని పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతోందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్ వలి అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మంగళవారం పేరేచర్లలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజలకు భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు రవీందర్ రెడ్డి, ఇమ్మానియేలు, రామాంజనేయులు, పున్నారెడ్డి, నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**ఫిరంగిపురం:** మండలంలోని రేపూడి, నుదురుపాడు, మేరికపూడి, 113.తాళ్లూరు, తక్కెళ్లపాడు, అల్లంవారిపాలెం, వేములూరిపాడు, పొనుగుపాడు, వేమవరం గ్రామాల్లో దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అల్లంవారిపాలెం, సొలసబస్టాండు సెంటర్లలోని రాజశేఖరుని విగ్రహానికి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సొలస బస్టాండు సెంటర్లో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పట్టణ అధ్యక్షుడు కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, పాలపాటి రఘు, బద్దూరి శ్రీనివాసరెడ్డి, బి.అంజిరెడ్డి, పెరికల చిన్నా, వై.హేమలతారెడ్డి, రాయప్ప, కె.ప్రాన్సిస్, వై.ఆశీర్వాదం, పాపిరెడ్డి, డి.చిన్నయ్య, భాను, శ్రీధర్‌రెడ్డి, అయ్యప్ప, డి.సురేష్, చేవూరి రామమోహన్‌రెడ్డి, పి.శ్రీనివాసరెడ్డి, రామతిరుపతమ్మ, ఎస్.నిర్మల, సుబ్బారావు, లింగారావు, వీరాస్వామి, వెంకటస్వామి, కె.మల్లికార్జున, ఆర్.వెంకటేశ్వర్లు, కాటంరాజు తదితరులు పాల్గొన్నారు.

**సేవా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు..**

**మంగళగిరి టౌన్:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల గుండెల్లో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారని.. సంక్షేమ ప్రదాతగా.. అభివృద్ధి విధాతగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు కొనియాడారు. మంగళగిరి పట్టణ పరిధిలోని బస్టాండ్ వద్ద గల వైఎస్సార్ విగ్రహం వద్ద మంగళవారం వర్ధంతిని నిర్వహించారు. రాజశేఖరుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నవులూరు సెంటర్, చినకాకాని సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి వేమారెడ్డి స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. డాక్టర్ వైఎస్సార్, మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహాలకు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వకర్త దొంతిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయం వేడుకల్లో వేమారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆత్మకూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు కార్యక్రమాల్లో మంగళగిరి పట్టణ, మండల అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకట కృష్ణ, సీనియర్ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, మహిళా నాయకులు సంకె సునీత, మల్లవరపు సుధారాణి, కలకోటి స్వరూపారాణి, మాజీ ఎంపీపీ రత్నకుమారి, మంగళగిరి పట్టణ, మండలాల వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మోరంపూడి కార్యక్రమంలో దొంతిరెడ్డి వేమారెడ్డి

**మేడికొండూరు:** ప్రజల సంక్షేమం కోసం రాజశేఖరరెడ్డి అహర్నిశలు శ్రమించారని జెడ్పీటీసీ కందుల సిద్దయ్య అన్నారు. మండలంలో వైఎస్సార్ వర్ధంతిని ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉడతా ప్రభాకర్, షేక్ బాజీ జిల్లా కార్యదర్శి, పాములపాటి జయరావు, తవ్వగుంట గఫార్, గుడిపూడి రాజేంద్రప్రసాద్, షేక్ నాగుల్ మీరా, బుర్ర వెంకట సుబ్బారెడ్డి, చావ్వాటి మహబూబ్, తల తోటి జవహర్, కోకా అర్జునరావు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**మంగళగిరి టౌన్:** రాజశేఖరరెడ్డి వర్ధంతిని నగర పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు కంతేటి జీవన సాగర్, జిల్లా ఓబీసీ చైర్మన్ పున్నారావు, నియోజకవర్గ ఓబీసీ చైర్మన్ శ్రీనివాస్,పట్టణ వైస్ ప్రెసిడెంట్ దామర్ల వీర ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

**దుగ్గిరాల:** రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మోరంపూడి, తుమ్మపూడి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో దొంతిరెడ్డి వేమారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాజన్న విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. గ్రామ సర్పంచి జానీ భాషా, పార్టీ గ్రామ అధ్యక్షులు కె.పృథ్వీరాజు, నజీర్, సుధాకర్, భాస్కర్, తిరుమల రావు, దేవరాజు, హృదయ రాజు, బుల్లిబాబు, జానీ, చాంద్‌బాషా, ఆత్మకూరు నాగేశ్వరరావు, ఎ.ధనుంజయ్, టి.వెంకట నారాయణ, ఎం.నాగరాజు, ఎస్.కోటేశ్వరరావు, కోడూరి రవి, నాగూర్ బాయి, జి.ఫణీంద్ర, ఎండీ బాజీ, కె.నాగమహేంద్ర వర్మ, ఎం.రాము, టి.చందు పాల్గొన్నారు.

**తాడికొండ:** రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని తాడికొండ, తుళ్ళూరు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ బస్టాండ్ కూడలిలోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబులు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం భారీ అన్నదానం ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు వంగా పోలారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు, మేధావుల ఫోరం కార్యదర్శి ఆళ్ల హనుమంతరావు, దాసరి రాజు, మాజీ సొసైటీ అధ్యక్షుడు చుండు వెంకటరెడ్డి, నియోజకవర్గ రైతు విభాగం నాయకులు మల్లంపాటి రాఘవరెడ్డి, మండల యువజన , బీసీ విభాగం అధ్యక్షులు షష్తక్ అజీస్, దమ్మాటి మోహనరావు, వివిధ విభాగాల నాయకులు ఇసుకపల్లి రమేష్, పులి రమేష్, ధూళిపాళ్ళ నాగేశ్వరరావు, షేక్ బాజీ, సాంబిరెడ్డి, షేక్ సలీమ్, రావూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు. లాం, నిడుముక్కల, పొన్నెకల్లు, రావెల, దామరపల్లి పలు గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించి అన్నదానం నిర్వహించారు. తుళ్ళూరు మండలం దొండపాడు గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, వనమా బాల వజ్రబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మైనేని నాగమల్లేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాకుమాను బ్రహ్మయ్య వివిధ విభాగాల నాయకులు చుండు వెంకటరెడ్డి, కొప్పుల శేషగిరిరావు, ఆరేపల్లి జోజి, బెజ్జం రాంబాబు, నేలపాటి నాగేంద్ర, నాయుడు నాగేశ్వరరావు, టి వరప్రసాద్ రెడ్డి, నేలపాటి వినోద్, దానం వినోద్, సుంకర శ్రీనివాసరావు, షేక్ జానీ, రామకృష్ణ, కొప్పుల ఆంద్రీయప్ప, డీజే శ్రీనివాసరావు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.



దొండపాడు కార్యక్రమంలో మోదుగుల, డైమండ్ బాబు



రేపూడిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



ఫిరంగిపురం కార్యక్రమంలో జెడ్పీటీసీ కత్తిరేణమ్మ, నాయకులు



నవులూరులో నివాళులర్పిస్తున్న వేమారెడ్డి



వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ కందుల సిద్దయ్య

## కేఎల్‌యూలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభం

**తాడేపల్లి రూరల్:** వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో జునిపర్ ఏఐ డ్రివెన్ క్యాంపస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జునిపర్ అకాడమీ గ్లోబల్ హెడ్ అర్చన మాట్లాడుతూ.. నెట్‌వర్కింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రానున్న తరానికి చెందిన సాంకేతికతలలో నైపుణ్య అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎడ్యుస్కిల్స్ సి.ఇ.ఒ. శుభజీత్ జగదేవ్ ఏఐ ఆధారిత నెట్‌వర్కింగ్ ప్రాముఖ్యతను వివరించారు. 60 మందికి పైగా ఫ్యాకల్టీ సభ్యులు నెట్ వర్కింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీలో ఇంటెన్సివ్ శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా సమర్థమైన శ్రామిక శక్తిని సృష్టించాలన్న వర్సిటీ దూరదృష్టిని మరింత పెంచుతుందన్నారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు, ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో జునిపర్ అకాడమీ గ్లోబల్ హెడ్ అర్చన యాదవ్

## మంగళగిరిలో పాసింగ్ ఔట్ పరేడ్

**మంగళగిరి టౌన్:** మంగళగిరి నగర పరిధిలోని ఏపీఎస్‌పీ ఆరో బెటాలియన్‌లో మంగళవారం 22వ బ్యాచ్ పాసింగ్ ఔట్ పరేడ్ నిర్వహించారు. ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, ఇంటిలిజెన్స్ డిపార్ట్‌మెంట్ తరుపున శిక్షణ పూర్తి చేసుకున్న 38 జాగిలాలు ఈ పరేడ్‌లో పాల్గొన్నాయి. కార్యక్రమానికి రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్త, ఇంటిలిజెన్స్ ఐజీ మహేష్ చంద్రాలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో జాగిలాలు కీలకమైన పాత్ర పోషిస్తాయన్నారు. నేర పరిశోధనలో, ముఖ్యంగా మాదక ద్రవ్యాల కేసులో ఈ జాగిలాలు చేసే పనులు మరెవరూ చేయలేరని ప్రశంసించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి జాగిలానికి రెండు అంశాల్లో శిక్షణ ఇవ్వడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. పోలీస్ జాగిలాల ప్రదర్శన, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన జాగిలాలకు బహుమతులు అందజేసి, వాటికి శిక్షణ ఇచ్చిన వారికి అభినందనలు తెలిపారు.



పోలీస్ వందనం చేస్తున్న జాగిలాలు

## సీఆర్‌డీఏ రైతుల ధర్నా నేడు

**మంగళగిరి:** మండలంలోని కురగల్లు గ్రామ సీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట బుధవారం ఉదయం 10 గంటలకు రైతులు ధర్నా నిర్వహిస్తున్నట్లు రాజధాని పోరంబోకు భూముల రైతు సంఘం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు బతికి ఉన్న రైతులను మృతుల జాబితాలో చూపడంపై జీవో నంబరు 41కే 5 అమలు చేయాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ధర్నాలో సీఆర్‌డీఏ పరిధిలోని రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## చేనేత ఉప వృత్తుల వారికి ఉచిత విద్యుత్ ఇవ్వాలి

**మంగళగిరి టౌన్:** చేనేతపై ఆధారపడి పనిచేసే అనేక ఉప వృత్తుల వారికి కూడా ఉచిత విద్యుత్ ఇవ్వాలని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఆత్మకూరు గ్రామం నిమ్మగడ్డ రామ్మోహనరావు విజ్ఞాన కేంద్రంలో ఏపీ చేనేత కార్మిక సంఘ గ్రామ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. వ్యవసాయం తరువాత రెండో ప్రాధాన్యత కలిగిన రంగం చేనేత రంగమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు పవర్‌లూమ్ యజమానులకు కోట్ల రూపాయలు రాయితీ ఇస్తూ చేనేత రంగాన్ని ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు డి.రామారావు, వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అజయ్‌కుమార్, సీఐటీయూ నాయకులు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## కేఎల్‌యూలో ప్రపంచ కొబ్బరి దినోత్సవం

**తాడేపల్లి రూరల్:** వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని పీ అండ్ డీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీ అండ్ డీ విభాగ సీనియర్ డైరెక్టర్ గురుమూర్తి గంగాధరన్ మాట్లాడుతూ.. కొబ్బరి చెట్టును కల్పవృక్షమని పిలుస్తారని, ఈ చెట్టు ప్రతి భాగం మనిషికి ఏదో విధంగా ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విభాగం అసోసియేట్ డీన్ కన్నెగంటి జ్యోతిష్య బ్రహ్మాచారి, చిదంబరరావు, నాగేశ్వరరావు, లైబ్రేరియన్ తాతారావు తదితరులు పాల్గొన్నారు.



కొబ్బరి చెట్టుకు ఎరువులు వేస్తున్న విద్యార్థులు

## సమిత్వ సర్వే పరిశీలన

**దుగ్గిరాల:** తెనాలి డివిజన్ పరిధిలోని 5 మండలాల పరిధి 54 గ్రామాలు, 36 రెవెన్యూ గ్రామాలలో 76 ప్రత్యేక టీంలతో సర్వే చేస్తునట్లు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె.శ్రీదేవి అన్నారు. మంగళవారం దుగ్గిరాల సమిత్వ సర్వేను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ ఈవో వివేకానంద పాల్గొన్నారు.

## యూపీహెచ్‌సీలో ఆశా డే

**మంగళగిరి టౌన్:** యర్రబాలెం యూపీహెచ్‌సీలో మంగళవారం ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ.. గత ఆరు నెలలుగా యూపీహెచ్‌సీలో పర్మినెంట్ డాక్టర్లు లేరని, తక్షణమే డాక్టర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**దుగ్గిరాల:** మండలంలో 20,064 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ షేక్ జబీన్ తెలిపారు. మంగళవారం దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు గ్రామంలో ఆమె పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల తాహసీల్దారు సునీత, వి.ఝాన్సీరాణి పాల్గొన్నారు.

### CHANGE OF NAME

I, PAYYAVULA VENKAT MAHESH (Old Name), S/o PAYYAVULA VENKATA SUBBAIH CHOWDARY, Resident of Flat No. 508, Kondapaneni Towers, Kondapaneni Township, Mangalagiri, Guntur-522503 A.P. I have changed my name as PAYYAVULA VENKATA MAHESH (New Name), S/o PAYYAVULA VENKATA SUBBAIH CHOWDARY. Hereafter my name is known as PAYYAVULA VENKATA MAHESH (New Name), S/o PAYYAVULA VENKATA SUBBAIH CHOWDARY.